


EVENING EDITION


నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4 PM www.suryaa.com

శుక్రవారం 04-07-2025

పేజీలు: 02

## ఒకేసారి ఐదు ఉద్యోగాలు

సోహమ్ పరేఖ్.. సిలికాన్ వ్యాలీలో ఇప్పుడీ పేరు మార్మోగుతున్నది. ఒకేసారి పలు అమెరికన్ స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తూ రోజుకు 2 లక్షల రూపాయలు సంపాదిస్తున్న ఈ భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కథ ప్రకంపనలు సృష్టిస్తున్నది. 'మిక్స్‌ప్యానెల్' సహ వ్యవస్థాపకుడు, ప్లే గ్రౌండ్ ఏఐ ప్రస్తుత హెడ్ సుహైల్ దోషి ఈ మోసాన్ని ఎక్స్ వేదికగా బయటపెట్టాడు.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు పెద్ద కుమారుడు అకీరా నందన్, చిన్న కుమారుడు మార్క్ శంకర్‌తో శుక్రవారం ఉదయం మంగళగిరిలోని తన నివాసానికి చేరుకున్నారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులతో, పార్టీ ప్రతినిధులతో ముఖ్యమైన విషయాలపై చర్చించారు. అనంతరం మార్కాపురం నియోజక వర్గం పర్యటనకి బయలుదేరారు.

## కార్ల్సన్‌కు మరోసారి చెక్‌పెట్టిన గుకేశ్


క్రొయేషియాలో జరుగుతున్న గ్రాండ్ చెస్ టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు పరాభవం ఎదురైంది. భారత స్టార్ ప్లేయర్.. దొమ్మరాజు గుకేశ్ చేతిలో కార్ల్‌సన్ పరాజయం పాలయ్యాడు. తనదైన వ్యూహాలతో గుకేశ్.. నార్వే గ్రాండ్ మాస్టర్‌కు చెక్ పెట్టాడు. ఈ విభాగంలో గుకేశ్ తొలిసారి కార్ల్‌సన్‌పై విజయం సాధించాడు. సుమారు నెల రోజుల క్రితం కూడా గుకేశ్.. కార్ల్‌సన్‌ను ఓడించాడు. నార్వే చెస్ టోర్నీలో క్లాసికల్ విభాగంలో తొలిసారి అతడిపై గెలుపొందాడు. తాజాగా మరోసారి అదే తరహా ఫీట్ రిపీట్ చేశాడు.గుకేశ్ విజయం తర్వాత సోషల్ మీడియాలో ఓ విషయం చక్కర్లు కొడుతోంది. టోర్నీ ప్రారంభానికి ముందు.. కార్ల్‌సన్ గుకేశ్‌ను




తక్కువ చేసి మాట్లాడాడు. నార్వేలో ఓటమి హర్ట్ చేసిందో ఏమోగానీ.. హేళన చేస్తూ కామెంట్స్ చేశాడు. గ్రాండ్ చెస్ టోర్నీలో బలహీనమైన ఆటగాడు అంటూ గుకేశ్ మనో స్థైర్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేశాడు. ఇది గుర్తుపెట్టుకున్నాడే గానీ.. గుకేశ్ మాత్రం కార్ల్‌సన్‌కు గట్టి కౌంటర్ ఇచ్చాడు. కార్ల్‌సన్ నోటి నుంచి వచ్చిన వ్యాఖ్యలకు గుకేశ్ తన ఆటతో బదులిచ్చాడు. విమర్శించిన అదే నోటి నుంచి ప్రశంసలు అందుకున్నాడు.ఈ మ్యాచ్ తర్వాత మాట్లాడిన కార్ల్‌సన్.. గుకేశ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. "ఈ టోర్నీలో నా ప్రదర్శన ఏమాత్రం బాలేదు. చాలా చెత్తగా ఆడాను. ఇప్పుడు దొమ్మరాజు గుకేశ్ చేతిలో గట్టి దెబ్బ తగిలింది. ఈ గేమ్‌లో తొలుత నేను మంచి స్థితిలోనే ఉన్నా. కానీ గుకేశ్.. అవకాశాలను క్రియేట్ చేసుకున్నాడు. నాకు టైమ్ ఎక్కువ లేకపోవడంతో నేను ఈ పరిస్థితిని సరిగా హ్యాండిల్ చేయలేకపోయా. గుకేశ్ మంచి ఎత్తులు వేశాడు. క్రెడిట్ మొత్తం అతడికే దక్కుతుంది" అని కార్ల్‌సన్ వ్యాఖ్యానించాడు.కాగా గత నెలలో నార్వేలో జరిగిన టోర్నీలోనూ కార్ల్‌సన్‌పై గుకేశ్ ఆధిపత్యం చలాయించాడు. తన కెరీర్‌లో తొలిసారి క్లాసికల్ చెస్ పోటీలో అతడిపై విజయం సాధించాడు.

# తమ్ముడు మూవీ రివ్యూ


నితిన్ హీరోగా దిల్ రాజు నిర్మాణంలో వేణు శ్రీరామ్ తెరకెక్కించిన తమ్ముడు. వకీల్ సాబ్ తర్వాత వేణు తెరకెక్కించిన సినిమా కావడంతో అంచనాలు కూడా బాగానే ఉన్నాయి. ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా వచ్చిన తమ్ముడు ప్రేక్షకులను ఎంతవరకు అలరించింది అనేది పూర్తి రివ్యూలో చూద్దాం.. జై (నితిన్) ఒక ఆర్చర్.. చిన్నప్పటి నుంచి కష్టపడి విలువిద్యలో శిక్షణ తీసుకుంటాడు. ఎలాగైనా దేశానికి గోల్డ్ మెడల్ తేవాలి అనేది జై కల. కానీ బుల్స్ ఐ కొట్టడంలో ప్రతిసారి మిస్ అవుతూ ఉంటాడు. మీలో ఏదో సమస్య ఉంది ముందుగానే పరిష్కరించుకున్న తర్వాత లక్ష్యం వైపు ఆలోచించు అని కోచ్ చెప్పిన మాటలు విన్న తర్వాత.. పరిష్కారం కోసం బయలుదేరుతాడు జై. అలా తన అక్క ఝాన్సీ (లయ)కు చిన్నప్పుడు చేసిన అన్యాయం గుర్తుకొస్తుంది. దాంతో అక్క దగ్గరికి బయలుదేరుతాడు తమ్ముడు. అతను వెళ్లేసరికి అక్క కుటుంబం ప్రమాదంలో ఉందని తెలుసుకొని.. ఆమె ఇచ్చిన మాట కోసం ప్రాణాన్ని సైతం ఫణంగా పెడతాడు. అక్క ఇచ్చిన మాట కోసం తమ్ముడు ఏం చేశాడు అనేది మిగిలిన కథ.. అక్క మాట కోసం తమ్ముడు ఒక ఊరికి వెళ్లి ఏం చేశాడు అనేది ఈ సినిమా కథ. మనిషిపోయి మాట బతికితే మనిషి బతికినట్టే.. అదే మాట పోయి మనిషి బతికినా కూడా మనిషి పోయినట్టే అనేది ఈ సినిమా లైన్. సింపుల్గా మూడే ముక్కల్లో చెప్పాలంటే ఒక సిన్సియర్ గవర్నమెంట్ ఆఫీసర్ తో తప్పడు సంతకాల కోసం విలన్ ఆడే ఒక క్రూర నాటకం ఈ సినిమా. ఆ సిన్సియర్ ఆఫీసర్ తమ్ముడు హీరో. అక్కకు ఇచ్చిన మాట కోసం తమ్ముడు ఏం చేశాడు అనేది సినిమా కథ. వినడానికి చాలా సింపుల్ గా అనిపిస్తున్న కూడా స్క్రీన్ ప్లే వైస్ గా మ్యాజిక్ చేయాలి అనుకున్నాడు వేణు శ్రీరామ్. కానీ అది అసలు కుదరలేదు. తన గత సినిమాలలో కమర్షియల్ అంశాలు ఎక్కువగా చూపించిన వేణు.. తమ్ముడులో టెక్నికల్ పై ఫోకస్ చేశాడు. మ్యూజిక్ పరంగా ఈ సినిమా బాగుంది. నిర్మాత అబ్దుల్ రాజు చెప్పినట్టు మొదటి 15 నిమిషాల తర్వాత సినిమా మొత్తం



ఒక రోజులో జరిగే కథ. ఇలాంటి సినిమాలకు స్క్రీన్ ప్లే చాలా పకడ్బందీగా ఉండాలి. కానీ ఆ విషయంలోనే వేణు శ్రీరామ్ పూర్తిగా మిస్ ఫైర్ చేశాడు. అక్క అనుకోకుండా ఒక ఊరికి వెళ్లడం.. అక్కడ ఆమె కొన్ని సమస్యలలో ఇరుక్కోవడం.. ప్రజలకు ఇచ్చిన మాట తీర్చకుండా ఉండడం.. ఆ విషయం తెలిసి తమ్ముడు అక్క మాట కోసం అదే ఊరికి వచ్చి ఆమె ఆశయాన్ని ఎలా తీర్చాడు.. ఇవన్నీ చాలా సినిమాలలో చూసిన విషయాలు. ఇందులో ఒక డైలాగు ఉంటుంది అనుగక్షతి ప్రవాహా అని.. అంటే గో విత్ ద ఫ్లో అని అర్థం. దారి ఎటు చూపిస్తే అటు వెళ్లిపో అని దాని మీనింగ్. కథ కథనాలు కూడా అలాగే వెళ్ళిపోయాయి. నితిన్ నటన గురించి కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు. ఏ పాత్ర ఇచ్చినా కూడా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తూ ఉంటాడు. కాకపోతే కథలు వర్కౌట్ కానప్పుడు ఆయన మాత్రం ఏం చేస్తాడు. హీరో తర్వాత అత్యంత కీలకమైన పాత్ర లయ పోషించింది. అక్క పాత్రకు ఆమె ప్రాణం పోసింది. మరో చిన్న పాప క్యారెక్టర్ కూడా చాలా బాగుంది. ఇక హీరోయిన్స్ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ తమ పాత్రలకు న్యాయం చేశారు. లేడీ విలన్ గా స్వస్తిక విజయ్ బాగుంది. మరో కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు సౌరబ్ సచ్ దేవ్ బాగా నటించాడు. మిగిలిన వాళ్ళందరూ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు. ఈ సినిమాకు ప్రధానమైన బలం సంగీతం. అజనీష్ లోక్నాథ్ ఈ విషయంలో సూపర్ సక్సెస్ అయ్యాడు. పాటల కంటే ఎక్కువగా బ్యాగ్రౌండ్ స్కోరు విషయంలో ఎక్కువగా ఆకట్టుకున్నాడు అజినిష్. సినిమాటోగ్రఫీ కూడా అద్భుతంగా ఉంది. ఎక్కువ భాగం సినిమా అడవిలోనే సాగుతుంది. అక్కడి అందాలను చాలా బాగా చూపించాడు సినిమాటోగ్రాఫర్స్ సమీర్ రెడ్డి, కె.వి గుహన్, సత్యజిత్ పాండే. ఎడిటర్ ప్రవీణ్ పూడి ఇంకాస్త కఠినంగా ఉండి కొన్ని సన్నివేశాలు తొలగించాల్సి ఉంటే బాగుండేది. నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉన్నాయి.

## సాలిడ్ అందాలతో తమన్నా

నటి తమన్నా తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన గ్లామర్, డ్యాన్స్‌తో సౌత్ ని షేక్ చేస్తున్న ముద్దుగుమ్మ మరోసారి తన హాట్ హాట్ అందాలు చూపిస్తూ కుర్రకారు చూపులకు కళ్లెం వేసింది.నటుడు విజయ్ వర్మతో లవ్ బ్రేకప్ తర్వాత మిల్కీ బ్యూటీ ఫోకస్ అంతా లవ్, మ్యారేజ్‌పై కాకుండా కెరియ్ వైపు షిఫ్ట్ చేసింది. అందుకే ఈరేంజ్‌లో అందాలు ఆరబోస్తోంది తమిళం, తెలుగు,కన్నడ సినిమాల్లో నటిస్తున్న తమన్నా ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా బిజీ అయిపోయింది. రజనీకాంత్ 'జైలర్' సినిమాలో నువ్ కావాలయ్యా అంటూ హుషారెత్తించే ఐటమ్ సాంగ్‌కి మాల్, మసాలా డ్యాన్స్ చేసిన తమన్నా ఈసినిమా హిట్ లో భాగస్వామిగా మారిపోయింది. తమన్నా ఐటమ్ సాంగ్ అయితే ఇప్పటికి మార్మోగిపోతోంది.



## బీజేపీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళ

# ముగ్గురిలో ఎవరికి దక్కేనో?

కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవడంతోపాటు దేశంలో సగానికిపైగా రాష్ట్రాల్లో అధికారం చేలాయిస్తున్న బీజేపీ.. పార్టీని మరింతగా విస్తరించేందుకు సిద్ధమవుతున్నది. మరోసారి ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవడం, విపక్షాల ఏలుబడిలో ఉన్న ఆ ఐదారు రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకోవడానికి కాషాయ దళం ప్రణాళికలు రచిస్తున్నది. గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మహిళలను చేజార్చుకోకూడదని కమలం పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళను కూర్చోబెట్టాలని తీవ్రంగా ఆలోచిస్తున్నది. దీనికి ఆర్ఎస్ఎస్ కూడా పచ్చజెండా ఊపినట్లు సమాచారం. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షురాలు పురందే శ్వరి పేర్లను పార్టీ అగ్రనాయకత్వం పరిశీలిస్తున్నది. ఈ ముగ్గురిలో ఎవరినో ఒకరిని అధ్యక్ష పదవి వరించనుంది. ఒకవేళ అదే జరిగితే కషాయ దళానికి తొలిసారిగా ఓ మహిళ సారథి కానున్నది. అయితే ఈ రేసులో ప్రధాని మోదీ కేబినెట్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది.

నిర్మలా సీతారామన్..

పార్టీ అధ్యక్ష రేసులో నిర్మలా సీతారామన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇటీవలే జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోశ్‌లు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సీతారామన్ పేరునే చర్చించినట్లు తెలుస్తున్నది. కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణమంత్రిగా తానేంటో నిరూపించుకున్న ఆమెకు పార్టీలో సుదీర్ఘమైన అనుభవం ఉంది. అలాగే నాయకత్వ సామర్థ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె నియామకంతో దక్షిణాదిలో పాగా వేయాలన్న లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలిసొచ్చే అవకాశం ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని భావిస్తున్న మోదీ సర్కార్.. త్వరలోనే ఈ బిల్లును కూడా ఆమోదించా లని ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో నిర్మలమ్మ అయితేనే సరైనవారని పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా ఉన్నది. ఆమెకు ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు



తెలుస్తున్నది.

వనతి శ్రీనివాసన్

తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. న్యాయవాది వృత్తి నుంచి రాజకీయ నాయకురాలిగా ఎదిగిన ఆమె ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 1993లో బీజేపీలో చేరిన ఆమె అంచలంచలుగా ఎదుగుతూ.. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో ప్రమోషన్ పొందిన ఆమె.. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అనంతరం 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమితురాలై.. తమిళనాడు నుంచి ఈ పదవి పొందిన మొదటి మహిళగా నిలిచారు.

పురందేశ్వరి

బహుభాషా కోవిధురాలైన రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ మాజీ ప్రెసిడెంట్ పురందేశ్వరి కూడా పార్టీ జాతీయ అధ్యక్ష రేసులో నిలిచారు. కేంద్రమంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న ఆమె నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పుంజుకున్నది. ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధుల బృందంలో పురందేశ్వరి కూడా ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి చేపట్టాలంటే ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఉండాల్సిందే. అధ్యక్ష ఎంపికలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర ప్రధానమైనది. ఇటీవల పలు రాష్ట్రాల్లో నియమితులైన పార్టీ అధ్యక్షుల్లో ఆర్ఎస్ఎస్ ముద్ర స్పష్టంగా కనిపిస్తున్న విషయం తెలిసిందే. పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న వారికే పదవుల్లో ప్రియార్టీ ఇస్తున్నది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం.. 63 మంది మృతి

హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. ఈ కారణంగా రాష్ట్రంలోని బియాస్ నది సహా ప్రధాన నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. కార్లు కొట్టుకుపోయాయి. ఈ వర్షాలకు మండి జిల్లా తీవ్ర విధ్వంసానికి గురైంది. భారీ వర్షాలు, వరదలకు దాదాపు 400కుపైగా రోడ్లను అధికారులు మూసివేశారు. అనేక మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇక ఈ వర్షాల కారణంగా ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 63కి పెరిగింది. మరో 40 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. అనేక మంది గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు



కొనసాగిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జులై 5న సిమ్లా, సోలన్, సిర్మౌర్, జులై 6న ఉనా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కాంగ్రా, చంబా, మండి జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఈ మేరకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది.

## రాజాసింగ్‌పై అనర్హత వేటు వేసేందుకు సిద్ధమైన బీజేపీ



ఎమ్మెల్యే రాజాసింగ్ పై అనర్హత వేటు కు రంగం సిద్ధమైంది. పార్టీకి రాజీనామా చేసిన రాజాసింగ్ పైన బీజేపీ నాయకత్వం సీరియస్ గా ఉంది. పార్టీ పైన కొంత కాలంగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందిగా మారాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక వేళ రాజాసింగ్ రాజీనామా నిర్ణయం ప్రకటించారు. అధినాయకత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తాను వ్యవహరిస్తానని రాజా సింగ్ చెబుతూ వచ్చారు. తాజాగా రాజాసింగ్ పై అనర్హత వేటు వేయాలని స్పీకర్ కు లేఖ రాసేందు కు బీజేపీ సిద్దమైంది. దీంతో, గోషామహల్ కు బై పోల్ ఖాయంగా కనిపిస్తోంది. అనర్హత వేటు బీజేపీలో వివాదాస్పదంగా మారిన రాజాసింగ్ వ్యవహారం పైన పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. రాజాసింగ్ రాజీనామా.. వ్యాఖ్యల పైన పార్టీ రాష్ట్ర నాయకత్వం ఢిల్లీకి నివేదిక పంపిన ట్లు సమాచారం. రాజాసింగ్ రాజీనామా లేఖను అధినాయకత్వానికి పంపారు. తాను బీజేపీ సింబల్ పైన ఎమ్మెల్యేగా గెలిచానని.. తన పదవి పైన అనర్హత వేటు కోరుతూ పార్టీ నేతలే స్పీకర్ కు లేఖ రాయాలని రాజాసింగ్ సూచించారు. ఆ తరువాత పార్టీ అధినాయకత్వం తన రాజీనామా లేఖ పైన స్పందన చూసిన తరువాత తన నిర్ణయం ఉంటుందని చెప్పకొచ్చారు. అయితే, పార్టీ క్రమశిక్షణ ఉల్లఘించారనే కారణంతో రాజాసింగ్ విషయంలో మరో ఆలోచన వద్దనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రాజీనామా ఆమోదానికి నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.



## ప్రియుడి కోసం లింగ మార్పిడి చేయించుకున్న యువకుడు

ప్రేమించిన వ్యక్తి కోసం లింగ మార్పిడి చేయించుకుంటే, అతడు పెళ్లికి నిరాకరించి శారీరకంగా వేధించాడంటూ 25 ఏళ్ల యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిపై అత్యాచారం, వేధింపుల కింద కేసు నమోదు చేశారు. రైసెన్ జిల్లా ఒబేదుల్లాగంజ్‌కు చెందిన బాధితురాలు, నర్మదాపురానికి చెందిన నిందితుడు పదేళ్ల క్రితం కలుసుకున్నారు. ఇద్దరూ స్వలింగ సంపర్కులు కావడంతో వారి పరిచయం ప్రేమగా మారింది. ఆపై చాలాకాలం పాటు సహజీవనం చేశారు. ఈ క్రమంలో, తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ప్రియుడు లింగ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని ఒత్తిడి చేసినట్టు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.ప్రియుడి మాట నమ్మి ఇండోర్‌లోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని యువతిగా మారింది. అయితే, సర్జరీ జరిగిన కొన్ని నెలలకే నిందితుడు ఆమెను దూరం పెట్టడం మొదలుపెట్టాడు. పెళ్లి ప్రస్తావన తేగా, ముఖం చాటేసి చివరకు నిరాకరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు బుధవారం భోపాల్ పోలీసులను ఆశ్రయించింది. నిందితుడు క్షుద్రపూజలు కూడా చేస్తాడని, లింగ మార్పిడికి ముందే తనను లైంగికంగా వాడుకున్నాడని బాధితురాలు ఆరోపించినట్టు పోలీసులు వివరించారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా, లింగ మార్పిడి జరిగినట్టు నిర్ధారణ అయిందని అధికారులు తెలిపారు.

# ఉప్పు కప్పురంబు రివ్యూ




ఈ వారం ఓటిటిలో రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో నేరుగా డిజిటల్ గానే రిలీజ్ కి వచ్చిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ అలాగే టాలెంటెడ్ నటుడు సుహాస్ కలయికలో తెరకెక్కిన కామెడీ డ్రామా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. 1990 సమయంలో ఒక వింతైన ఊరు చిట్టి జయపురం అక్కడ అపర్ణ (కీర్తి సురేష్) అనే అమ్మాయి ఆ ఊరికి ప్రెసిడెంట్ గా కొన్ని కారణాలు రీత్యా ఎంపిక అవుతుంది. అయితే తన పాత్ర కోసం కొంచెం కూడా తెలియని అపర్ణ ఆ ఊరి పెద్దలు, ప్రజలతో అవస్థలు పడుతూ ఉంటుంది. ఇంకోపక్క చిన్నా (సుహాస్) ఆ ఊరి కాటి కాపరిగా పని చేస్తుంటాడు. ఈ సమయంలో ఆ ఊరి కాష్టం విషయంలో ఒక చిక్కు వచ్చి పడుతుంది. ఆ ఊరు స్మశానంలో కేవలం నలుగురికి సరిపడా చోటు మిగిలి ఉంటుంది. దీనితో ఆ ఊరు ప్రజలు ఆ నాలుగు చోట్లలో తమకే ఓ చోటు కావాలని కంగారు పడతారు. చిన్నా తల్లి కూడా కాన్సర్ కారణంగా ఆమెకి కూడా మరణం దగ్గరే ఉంటుంది. ఇలాంటి సమయంలో అపర్ణ ఏం చేసింది? ఇందులో చిన్నా ఎలా సహకరిస్తాడు? తన తల్లి చివరి కోరిక తీర్చాడా లేదా అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూడాలి.
మొదటిగా ఇలాంటి ఒక ఇంట్రెస్టింగ్ అండ్ యునిక్ పాయింట్ ని ఎంచుకున్న దర్శకున్ని మెచ్చుకోవాల్సిందే. ఈ తరహా సున్నితమైన కాన్సెప్ట్ ని ఆవిష్కరించడం అనేది అంత సులువేం కాదు. ఇక నటీనటుల్లో సుహాస్ మరోసారి తన మార్క్ సహజమైన నటనతో షైన్ అయ్యాడు. ఒక కాటి కాపరిగా, నవ్విస్తూనే తన మార్క్ ఎమోషనల్ పెర్ఫామెన్స్ ని కూడా చేసి కదిలిస్తాడు. ఇక ఇది కీర్తి సురేష్ నుంచి కంప్లీట్ గా ఒక కొత్త వెర్షన్ అని చెప్పవచ్చు. ఇది వరకు కీర్తి చాలా విలేజ్ అమ్మాయిల పాత్రలు చేసింది. మహానటిలో తన కెరీర్ బిగినింగ్ సమయంలో చూపించే క్యూట్ అండ్ అమాయకత్వం పెర్ఫామెన్స్ కి ఇది ఫుల్ ఫ్లెడ్జ్ గా ఉంటుంది. ఇందులో తన లుక్ సహా నటన మరింత ఇంపుగా సహజంగా కనిపిస్తాయి. తన పాత్ర ప్రవర్తన, కన్ఫ్యూజన్ అందులో కామెడి భలే అనిపిస్తాయి. ఇక సీనియర్ నటుడు బాబు మోహన్ కూడా చాన్నాళ్ల తర్వాత కనిపించి ఆకట్టుకున్నారు. శత్రు, మధుబాబు తదితరులు మంచి పెర్ఫామెన్స్ లు అందించారు. అలాగే తాళ్లూరి రామేశ్వరి చిన్న పాత్రలోనే కనిపించినా మంచి ఇంపాక్ట్ ని చూపించారు. ఈ సినిమాలో లైన్ బానే ఉన్నప్పటికీ అందరికీ కనెక్ట్ కాకపోవచ్చు. ఇలాంటి కాన్సెప్ట్ మీద కూడా సినిమా చేయొచ్చా అని కొందరు అనుకోవచ్చు, ఇలాంటి కాన్సెప్ట్ లతో ఎవరైనా సినిమా చేస్తారా ఇంకొందరు నెగిటివ్ గా అనుకోవచ్చు. సో ఆ ఛాన్స్ ఈ సినిమాపై ఉంది. ఇక కథనం కూడా ఇంకొంచెం బెటర్ గా ప్లాన్ చేయాల్సింది. ముఖ్యంగా ఫస్టాఫ్ లో చాలా వరకు సన్నివేశాలు ఇంకా బెటర్ గా చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని అనవసర సన్నివేశాలు తగ్గించి ఉంటే ఫ్లో ఇంకొంచెం బెటర్ గా సాగి ఉండేది. అలాగే కీర్తి సురేష్ తన రోల్ లో బాగానే చేసింది కానీ కొన్ని సన్నివేశాల్లో మాత్రం కొంచెం ఓవర్ గా అనిపిస్తుంది. ఇంకా బెటర్ గా తన రోల్ డిజైన్ చేయాల్సింది. తాళ్లూరి రామేశ్వరి పాత్ర కూడా ఇంతే తన రోల్ మంచి ఇంపాక్ట్ కలిగించేలా అనిపిస్తుంది కానీ ఎక్కడో కంప్లీట్ గా అనిపించదు. ఇంకా ఆమె పాత్రలో ఎమోషనల్ డెప్త్ ని యాడ్ చేయాల్సింది. ఇంకా చాలా పాత్రలు కనిపిస్తూ ఉంటాయి ఇవన్నీ కథనంలో అనవసరంగా చేర్చినట్టు అనిపిస్తుంది. వీటితో అక్కడక్కడా బోర్ కూడా కలుగక మానదు. సినిమాలో నిర్మాణ విలువలు కానీ ప్రొడక్షన్ డిజైన్ గాని బాగున్నాయి. నాచురల్ అట్మాస్పియర్ ని చూపించారు. అలాగే సంగీతం బాగుంది. ఎడిటింగ్ ఇంకొంచెం బెటర్ గా చేయాల్సింది. సినిమాటోగ్రఫీ కూడా మరో ఆకర్షణ అని చెప్పవచ్చు. ఇక దర్శకుడు అని ఐ వి శశి విషయానికి వస్తే.. తాను మంచి కథనే పట్టుకున్నారు అలాగే చాలా వరకు ఎంగేజ్ చేసే ప్రయత్నమే చేశారు. కానీ కొన్ని కొన్ని చోట్ల మాత్రం అదే ఫ్లోని కంటిన్యూ చేసి ఉంటే ఉప్పు కప్పురంబు మరింత ఎంటర్టైనింగ్ గా అనిపించి ఉండేది. ఇంకొంచెం గ్రౌండ్ వర్క్ తాను చేసి ఉంటే బాగుండేది. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే.. ఈ 'ఉప్పు కప్పురంబు' ఒక సింపుల్ కామెడీ ఎమోషనల్ డ్రామా అని చెప్పవచ్చు. కీర్తి సురేష్మ సుహాస్ లు తమ నటనతో మెస్మరైజ్ చేస్తారు. అలాగే కాన్సెప్ట్ కూడా బానే ఉంది కానీ మేజర్ ఆఫ్ ఆడియెన్స్ కి ఇది కనెక్ట్ అవుతుంది. కాకపోతే కొన్ని మూమెంట్స్ మాత్రం సినిమాలో డల్ గా అనిపిస్తాయి. సో వీటిని పక్కన పెడితే ఈ వీకెండ్ కి తక్కువ అంచనాలు పెట్టుకొని ట్రై చేస్తే ఓటిటిలో ఈ చిత్రం ఓకే అనిపిస్తుంది.




## రూ. 2 లక్షలకు బాలుడి అమ్మకం

మగ శిశువు విక్రయానికి సంబంధించిన వ్యవహారం బయటకు రావడంతో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపారు. నాగారం ప్రాంతానికి చెందిన నజీర్, ముస్కాన్ దంపతులకు నాలుగు రోజుల క్రితం మగ బాబు జన్మించాడు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్న నజీర్ తన స్నేహితుడి ద్వారా బాబును చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలకు రూ.2 లక్షలకు అమ్మే ప్రయత్నం చేశాడు. రూ.1 లక్ష తీసుకుని, మిగతా మొత్తానికి సమయం పెట్టుకున్నారు. అయితే డబ్బు ఆలస్యం కావడంతో తల్లి మనసు మార్చుకుని బాబును తిరిగి తీసుకోవాలనడంతో లొల్లి జరిగింది.

## ఆటోలో ప్రేమజంట ఆత్మహత్య!

కర్ణాటకలోని బెళగావి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రేమ జంట ఆటోలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెళ్లి చేసుకుని ఒక్కటవుదామని ఆశపడ్డారు. రాఘవేంద్ర జాదవ్ (28), రంజిత (26) అనే ఇద్దరు ఊరి బయట ఆటోలో విగతజీవులై కనిపించారు. వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు ఒప్పుకోలేదని తెలుస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన ఆత్మహత్య చేసుకున్నారని సమాచారం. ఇది ఆత్మహత్య, హత్య అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కెసిఆర్ అసెంబ్లీకి రావాలి

కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన వస్తే అన్ని అంశాలపై చర్చ జరుపుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హరీష్ రా వు, కెటిఆర్‌తో తమకు సంబంధం లేదని వాళ్లు లెక్కలోకి రారని, కెసిఆర్‌తోనే తమకు లెక్క అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అ న్నారు. కెసిఆర్, తాము ఉద్యమంలో పనిచేశామని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన అన్నారు. హరీష్ రావు ఉత్తి ఎమ్మెల్యే మాత్రమే అని, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని కోమటిరెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి తమ తప్పు, ఒప్పులను చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశా రు. కెసిఆర్ సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, తప్పులను చూపిస్తే సరిదిద్దుకుంటామని ఆయన పేర్కొన్నారు. కెసిఆర్‌తోనే తమకు లెక్క అని హరీష్ రావు ఎవరో తనకు తెలియదని ఆయన అన్నా రు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బి కార్యాలయం లో హ్యామ్ రోడ్ల ప్యాకేజీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రాఫిక్ రద్దీగా ఉన్న రోడ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలోనే హ్యామ్ మోడల్‌లో రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన ట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సిఎంతో చర్చ జరిపి ఈ నెలాఖరు వరకు 15 ప్యాకేజీల వరకు సెప్టెంబర్‌లో పనులు మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో హ్యామ్ మోడల్ రోడ్లు వేశారని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రూ.6వేల 500 కోట్లను రోడ్ల కోసం విడుదల కోమటిరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ. 350 కోట్లతో అప్రోచ్ రోడ్లను వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. సింగిల్ రోడ్లను సైతం పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

## క్యాబిన్‌లో మంటలు అంటుకుని ముగ్గురు సజీవదహనం

ఖమ్మం – వరంగల్ మధ్య జాతీయ రహదారిపై మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి ముగ్గురు సంజీవ దహనమయ్యారు. మరొకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. రెండు లారీలు వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా క్యాబిన్‌లో మంటలు చెలరేగి ఈ దారుణం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొట్టాయి. ఒక లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి ముగ్గురు అందులోనే సజీవ దహనం అయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఒక లారీ విజయవాడ నుండి పౌల్ట్రీ మెటీరియల్ లోడ్ తో గుజరాత్‌కు వెళ్తోంది. గ్రానైట్ లోడ్ లారీ వరంగల్ నుండి ఖమ్మం వైపు వెళ్తోంది. శుక్రవారం(జూలై 04) తెల్లవారుజామున ఈ రెండు లారీలు వేగంగా డీ కొనడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. క్యాబిన్‌లో సజీవదహనం అయిన మృతదేహాలను బయటకు తీసి మార్చురీకి తరలించారు.

# ఇంగ్లండ్‌పై గిల్ డబుల్ సెంచరీ

భారత్, ఇంగ్లండ్ మధ్య ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టుపై టీమ్ఇండియా పట్టు బిగిస్తున్నది. దిగ్గజాల నిష్క్రమణ వేళ ఈ సిరీస్‌కు ముందు టెస్టు సారథ్య పగ్గాలు అందుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (387 బంతుల్లో 269, 30 ఫోర్లు, 3 సిక్సర్లు) తన కెరీర్‌లో తొలి ద్విశతకంతో చెలరేగాడు. తొలి రోజు జోరును కొనసాగిస్తూ బర్మింగ్‌హామ్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో రికార్డుల దుమ్ము దులిపాడు. గతంలో ఇంగ్లండ్‌లో ఆ దేశంతో ఆడుతూ పెద్దగా ఆకట్టుకోని గిల్.. సారథిగా మాత్రం మూడో ఇన్నింగ్స్‌లోనే డబుల్ సెంచరీతో చెలరేగడంతో మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగుల రికార్డు స్కోరు చేసింది. గిల్‌కు తోడు రవీంద్ర జడేజా (89), వాషింగ్టన్ సుందర్ (42) రాణించారు. అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. రెండో టెస్టుకు బుమ్రా స్థానంలో వచ్చిన ఆకాశ్ దీప్ (2/36), హైదరాబాదీ పేసర్ సిరాజ్ (1/21) ఆతిథ్య జట్టును ఆరంభంలోనే దెబ్బకొట్టారు. మూడో రోజు ఉదయం సెషన్‌లో భారత బౌలర్లు ఇదే జోరును కొనసాగిస్తే మ్యాచ్ భారత్ చేతిలోకొచ్చినట్టే!
ఓవర్ నైట్ స్కోరు 310/5తో రెండో రోజును ఆరంభించిన భారత్.. తొలి సెషన్‌లో జోరు కొనసాగించింది. గిల్, జడేజా తొలి రోజు జోరును కొనసాగిస్తూ మొదటి సెషన్‌లో 4 రన్‌రేట్‌కు తగ్గకుండా ఆడారు. వోక్స్ ఓవర్లో సింగిల్‌తో జడ్డూ టెస్టుల్లో 23వ అర్ధ శతకం పూర్తిచేశాడు. స్టోక్స్ బౌలింగ్‌లో అతడు రెండు బౌండరీలు బాదగా.. కార్స్ ఓవర్లో గిల్ సైతం బ్యాక్ టు బ్యాక్ ఫోర్లతో అలరించాడు.